

కలుషిత జలం.. వ్యాధుల భయం..


చెరువును కప్పేసిన గుర్రపు డెక్క

AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in


## రేపు ట్రాన్స్‌కో రాష్ట్రస్థాయి హాకీ పోటీలు ప్రారంభం


**అక్షరటుడే, ఇందూరు:** తెలంగాణ ట్రాన్స్‌కో, డిస్కమ్స్ రాష్ట్రస్థాయి హాకీ ఛాంపియన్‌షిప్ పోటీలను సోమవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ప్రారంభిస్తున్నట్లు స్పోర్ట్స్ కౌన్సిల్ సభ్యులు గోపి తెలిపారు. పోటీలను సీపీ సాయి చైతన్య ఉదయం 10 గంటలకు ప్రారంభిస్తారని పేర్కొన్నారు. పోటీలు 6వ తేదీ వరకు జరుగుతాయన్నారు. అలాగే ప్రత్యేక ఆహ్వానితులుగా నిజామాబాద్ ఎస్ఈ రవీందర్, కామారెడ్డి ఎస్ఈ శ్రావణ్ కుమార్, రాష్ట్ర స్పోర్ట్స్ ఆఫీసర్ జగన్నాథ్ తదితరులు హాజరవుతారని తెలిపారు.



# క్రైంరేట్ తగ్గించాం

నిజామాబాద్ డివిజన్ పరిధిలో క్రైంరేట్ చాలా వరకు తగ్గించినట్లు ఏసీపీ రాజావెంకటరెడ్డి తెలిపారు. నగరంలో శాంతి భద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు వివరించారు. గత ఏడాది ఫిబ్రవరి 16న తాను ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. నగర ప్రజలకు వివిధ అంశాలపై అవగాహన కల్పించేందుకు నిరంతరం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. నగరంలో నేరాలు– శాంతిభద్రతలపై ఆయన 'అక్షరటుడే' ఇంటర్వ్యూలో పలు విషయాలు పంచుకున్నారు.

- అక్షరటుడే, నిజామాబాద్ సిటీ



- గంజాయి నియంత్రణకు చర్యలు
- రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా
- 'అక్షరటుడే'తో ఏసీపీ రాజా వెంకటరెడ్డి

నిజామాబాద్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు డివిజన్ పరిధిలో మత్తు పదార్థాల వాడకంపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు ఏసీపీ తెలిపారు. గంజాయి తాగే వారు ఉంటే.. అమ్మే వారు ఉంటారని ఆయన అన్నారు. గంజాయి వంటి మత్తుపదార్థాలను వినియోగించకుండా ప్రజలను చైతన్య పరుస్తున్నట్లు పేర్కొన్నారు. గంజాయి నివారణకు ప్రత్యేక ప్రణాళికను రూపొందిస్తున్నట్లు తెలిపారు. నిజామాబాద్ డివిజన్ పరిధిలో సుమారు 10 మంది గంజాయి అమ్మేవారిని గుర్తించామన్నారు. అలాగే మరో 20 మంది గంజాయికి బానిసై మహారాష్ట్ర ప్రాంతానికి వెళ్లి సేవిస్తున్నట్లు పేర్కొన్నారు. వారు అక్కడి నుంచి గంజాయి తెచ్చి ఇక్కడ విక్రయాలు సైతం చేపడుతున్నారని వెల్లడించారు. ప్రస్తుతం యువత గంజాయి తదితర మత్తు పదార్థాలకు బానిసలుగా మారడం ఆందోళనకరం అని పేర్కొన్నారు. మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని ఆయన సూచించారు. తల్లిదండ్రులు పిల్లల అలవాట్లపై ఓ కన్ను వేయాలని చెప్పారు.

### సిబ్బంది అవసరం

పెరుగుతున్న సైబర్ క్రైంలు, ఇతర నేరాలకు అనుగుణంగా నిజామాబాద్ డివిజన్ పరిధిలో గల పోలీస్ స్టేషన్లలో సిబ్బందిని పెంచాల్సిన అవసరం ఉందని ఏసీపీ రాజావెంకట రెడ్డి పేర్కొన్నారు. సిబ్బంది కొరతతో పనులలో కొంత జాప్యం ఏర్పడే అవకాశం ఉందన్నారు. నేరాల అదుపునకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. గంజాయి, మత్తు పదార్థాలు, ఆన్‌లైన్ బెట్టింగ్‌కు యువత దూరంగా ఉండాలని ఏసీపీ సూచించారు.

### 250 మంది రౌడీ షీటర్లు

డివిజన్ పరిధిలోని రౌడీ షీటర్లపై ప్రత్యేకంగా సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్సైల ఆధ్వర్యంలో నిఘా ఏర్పాటు చేశామని ఏసీపీ తెలిపారు. చిన్నా చితక ఘటనలు తప్పా.. పెద్ద సంఘటనలు చోటు చేసుకోవడం లేదన్నారు. సుమారు 250 మంది రౌడీషీటర్లలో పది మంది మాత్రమే యాక్టివ్‌గా ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. వీరిని కూడా అదుపు చేయడానికి చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. అలాగే రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు నిరంతర వాహన, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించడంతో రోడ్డు ప్రమాదాలు తగ్గాయన్నారు.



## స్థానిక ఎన్నికల్లో గెలుపు కోసం కృషిచేయాలి

**అక్షరటుడే, ఇందల్వాయి:** స్థానిక ఎన్నికల్లో బీజేపీ గెలుపు కోసం కార్యకర్తలు శాయశక్తులా కృషి చేయాలని ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, పార్టీ జిల్లా అధ్యక్షుడు కులాచారి దినేష్ కుమార్ అన్నారు. మండలంలోని గన్నారం గ్రామంలో వారు నాయకులతో కలిసి ఆదివారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. అంతకు ముందు కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. రానున్న స్థానిక ఎన్నికల్లో బీజేపీ గెలుపు కోసం కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు లోలం సత్యనారాయణ, రాష్ట్ర నాయకులు కేపి రెడ్డి యాదవ్, నాయుడు రాజన్న, మాజీ సర్పంచ్ కుంట మోహన్ రెడ్డి, అశోక్, గోపి, చిన్ను, భోజన్న, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## మెగా ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన

**అక్షరటుడే నిజామాబాద్ సిటీ:** నగరంలోని శివాజీ నగర్ మున్నూరుకాపు కల్యాణ మండపంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి అనూహ్య స్పందన లభించింది. రాష్ట్ర యూత్ కాంగ్రెస్ మాజీ ఉపాధ్యక్షుడు రామర్తిగోపి ఆధ్వర్యంలో ఆదివారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి నుడా ఛైర్మన్ కేశ వేణు, కాంగ్రెస్ సీనియన్ నాయకుడు కొండపాక రాజేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నగరంలోని పలు డివిజన్లకు చెందిన ప్రజలు మెగా ఉచిత వైద్య శిబిరానికి హాజరయ్యారు. స్పెషలిస్ట్ డాక్టర్ల ఆధ్వర్యంలో వైద్యపరీక్షలు చేశారు. జనరల్ ఫిజీషియన్ విశ్వతేజ్, గుండె వైద్య నిపుణులు రవి కిరణ్, ఆర్థోపెడిక్ సర్జన్ హర్షవర్ధన్ గౌడ్, సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ రాహుల్, ప్రసూతి వైద్య నిపుణులు శైలజ, చిల్డ్రన్స్ స్పెషలిస్ట్ అశ్విన్, దంత వైద్య నిపుణులు శిరీష శిబిరంలో ప్రజలకు వైద్యచికిత్సలు అందజేశారు. కార్యక్రమంలో రామర్తి గంగాధర్, ఆది శీను, గాండ్ల లింగం, అవిన్, విక్కి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

**అక్షరటుడే, బాన్సువాడ:** కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. మోస్రా, చందూర్‌లలో నిర్మించిన సమీకృత మండల కార్యాలయాల భవన సముదాయాలు, చందూర్‌లో జీపీ భవనాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ప్రసంగిస్తూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయాన్ని కల్పించినట్లు తెలిపారు. మహిళల ఆర్థికాభివృద్ధి కోసం పెట్రోల్ బంక్‌లు, మహిళా శక్తి క్యాంటీన్లు, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ, స్కూల్ యూనిఫామ్‌ల బాధ్యత మహిళా సంఘాలకే అప్పజెప్పామన్నారు. మహిళలు వ్యాపారాలు నిర్వహించుకునేందుకు వీలుగా వడ్డీలేని రుణాలను అందిన్నామని పేర్కొన్నారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ. 500లకే వంట గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని వివరించారు. రేషన్ కార్డులను కూడా మహిళల పేరుతోనే మంజూరు చేస్తున్నామని, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల్లో కూడా మహిళా సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించామని వివరించారు. ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకునే వారికి రూ.లక్ష వరకు వడ్డీ లేని రుణాలను అందించేలా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండేలా సమీకృత భవన సముదాయాలు నిర్మించామన్నారు. నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగంగా సాగుతున్నాయన్నారు. పోడు పట్టాలను అర్హులకు ఇచ్చామని.. మరికొందరు అర్హులు ఉన్నారని వారికి కూడా అందజేయాలని పోచారం మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లగా ఆమె సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో ఎంపీ సురేష్ షెట్కార్, ఆగ్రో ఇండస్ట్రీస్ ఛైర్మన్ కాసుల బాలరాజ్, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి, డీసీసీబీ మాజీ ఛైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.


లబ్ధిదారులకు రేషన్ కార్డులను అందజేస్తున్న మంత్రి సీతక్క, ఎంపీ సురేష్ షెట్కార్, ఎమ్మెల్యే పోచారం

## పార్టీ కోసం పనిచేసిన వారికి గుర్తింపు

- కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్


మాట్లాడుతున్న కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్

**అక్షరటుడే, ఆర్మూర్ :** పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ అన్నారు. జక్రాన్‌పల్లి మండలం అర్గుల్ శివారులోని యమునా గార్డెన్స్‌లో ఆదివారం నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల ముఖ్య కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్యకర్తలు కష్టపడే తత్వాన్ని అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి, ఎమ్మెల్యే భూపతిరెడ్డి, కార్పొరేట్ ఛైర్మన్లు ఈరవత్రి అనిల్, మానాల మోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్, ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జీలు వినయ్ రెడ్డి, సునీల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### ఆలూరులో శ్రమదానం



కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ ఆదివారం ఆలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆమె కార్యకర్తలతో కలిసి శ్రమదానం నిర్వహించారు. అనంతరం మొక్కలు నాటారు.

## మెడికల్ కళాశాలల అడ్మిషన్లలో స్థానికత జీవోను అమలు చేయాలి



**అక్షరటుడే, ఇందూరు:** మెడికల్ కళాశాలల అడ్మిషన్లలో స్థానికత కోసం తీసుకొచ్చిన జీవో నం.33ని అమలు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఏదైనా నాలుగేళ్లు తెలంగాణలో చదివిన విద్యార్థులకు స్థానికత (లోకల్) గుర్తింపు ఇచ్చేవారన్నారు. కానీ కొందరు తెలంగాణలో అభ్యసించకుండా నకిలీ సర్టిఫికెట్లతో మెడికల్ కళాశాలలో అడ్మిషన్లు పొందారన్నారు. దీంతో ఇక్కడి విద్యార్థులకు అన్యాయం జరిగిందని గుర్తు చేశారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం జీవో నం.33ని తీసుకొచ్చిందన్నారు. కానీ కొందరు స్థానికేతరులు కోర్టుకు వెళ్లారని చెప్పుకొచ్చారు. అడ్మిషన్ల ప్రక్రియ ఆలస్యం అవుతుందన్న కారణంతో కోర్టుకు వెళ్లిన వారందరినీ కోర్టు కౌన్సెలింగ్‌కు అనుమతిచ్చిందన్నారు. దీంతో స్థానికేతరులు అడ్మిషన్లు పొందారన్నారు. సీట్లు పొందిన వారిలో కొందరు ఒక్క ఏడాది కూడా తెలంగాణలో చదువుకోలేదని, కావున జీవో.33ని అమలు చేసి ఇక్కడి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో చారి, అంజయ్య, మధు, నరేందర్ రెడ్డి, ఉమేష్, విష్ణు, సంధ్య, ఉమేష్, కృష్ణ కుమార్ పాల్గొన్నారు.

## కోతుల బెడదకు కొండెంగ ఫ్లెక్సీతో చెక్



మొక్కజొన్న పంటను కోతులు నాశనం చేస్తుండడంతో ఓ రైతు వినూత్నంగా ఆలోచించాడు. డిచ్‌పల్లి శివారులోని పోలీస్ బెటాలియన్ వెనుక వైపు ప్రధాన రోడ్డు పక్కన మొక్కజొన్న పంట వద్ద కొండెంగ ఫొటోతో ఫ్లెక్సీని ఏర్పాటు చేశాడు. కొండెంగ ఫొటో చూసి కోతులు రావడం లేదు. ఈ ఫ్లెక్సీని అటువైపు వెళ్లే వాహనదారులు చూసి రైతు ఆలోచనను ప్రశంసిస్తున్నారు.

– అక్షరటుడే, డిచ్‌పల్లి

## జనహిత యాత్ర కాదు.. జనరహిత యాత్ర

### మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

**అక్షరటుడే, ఆర్మూర్:** కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ చేపట్టిన యాత్ర 'జనహిత పాదయాత్ర' కాదని.. 'జనరహిత పాదయాత్ర' అని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి ఎద్దేవా చేశారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. జనం లేక మీనాక్షి పర్యటన వెలవెలబోతోందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు ఎన్ని నెరవేర్చారో సిద్దులగుట్ట శివయ్య సాక్షిగా నిజాలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.




## 7న గోవాలో ఓబీసీ జాతీయ మహాసభలు



**అక్షరటుడే, ఇందూరు:** మండల్ డే సందర్భంగా ఈనెల 7న గోవాలో ఓబీసీ జాతీయ మహాసభలు నిర్వహించనున్నట్లు జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు నరాల సుధాకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ చేతుల మీదుగా మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నరాల సుధాకర్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం బీసీలకు 42 శాతం ఇవ్వాలనుకున్న రిజర్వేషన్ల బిల్లును కేంద్రం వెంటనే ఆమోదించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు రిజర్వేషన్లు ప్రకటించినప్పటికీ కేంద్రప్రభుత్వం మోకాలడ్డు వేయడం సబబు కాదన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రసాద్, దేవేందర్, చంద్రకాంత్, శ్రీలత, అజయ్, సాయి, సదానంద తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌ను బలోపేతం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలి



**అక్షరటుడే, భీమ్‌గల్:** బాల్కొండ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్ కుమార్ అన్నారు. మండలంలోని గోన్ గొప్పుల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు ఆయన సమక్షంలో ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతిహామీని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తూ వస్తోందన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్త భుజంపై ఉందన్నారు. అలా చేసినప్పుడే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతామని చెప్పారు. పార్టీలో చేరిన వారిలో కొత్తూర్ రాజాగౌడ్, కుమ్మరి రాజన్న, కుమ్మరి బాలయ్య, బంగ్లా నర్సయ్య, బండారి సూర్యదాసు, మిట్టపల్లి నర్సయ్య, కొమ్ము నవీన్, శ్రీహరి తదితరులున్నారు.

## హైవేపై రెండు బైక్‌లు ఢీకొని ఒకరి దుర్మరణం

**అక్షరటుడే ఇందల్వాయి:** రెండు బైక్‌లు ఢీకొని ఒకరు దుర్మరణం చెందిన ఘటన ఇందల్వాయి మండలం గన్నారం వద్ద ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్సై సందీప్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎత్తు తండాకు చెందిన లాల్‌సింగ్, హర్జు ఇద్దరు వ్యక్తులు బైక్‌పై గన్నారం వద్ద రోడ్డు దాటుతున్నారు. అదే సమయంలో వెనక నుంచి అతి వేగంగా వచ్చిన పల్సర్ బైక్ ఢీకొట్టింది. దీంతో రోడ్డు దాటుతున్న బైక్‌పై ఉన్న ఇద్దరి కింద పడ్డారు. ఈ ప్రమాదంలో హర్జు (55) అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తి లాల్ సింగ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అతడిని చికిత్స నిమిత్తం స్థానికులు టోల్ ప్లాజా అంబులెన్స్‌లో జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. పల్సర్ వాహనంపై వచ్చిన వ్యక్తి అతివేగంగా, అజాగ్రత్తగా నడపడం వల్లే ప్రమాదం చోటుచేసుకుందని స్థానికులు పేర్కొన్నారు. మృతుడి భార్య బాదవత్ లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

## ఆర్టీసీ బస్సును ఢీకొన్న ట్రాక్టర్.. పలువురికి గాయాలు

**అక్షరటుడే, కామారెడ్డి:** ఆర్టీసీ బస్సును ట్రాక్టర్ ఢీకొట్టిన ఘటన కామారెడ్డి మండలంలోని గర్గుల్‌లో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి నుంచి అన్నారం వైపు వెళ్తున్న బస్సు గర్గుల్ శివారులోని శాంతినగర్ సమీపంలోకి రాగానే ట్రాక్టర్ ఎదురుగా ఢీకొట్టింది. దీంతో బస్సులో ఉన్న ప్రయాణికులకు గాయాలయ్యాయి. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా.. వారు ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను ఏరియా ఆస్పత్రికి తరలించారు.

అసలే వర్షా కాలం.. ఆపై కుళాయిల్లో కలుషిత నీళ్లు వస్తుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. బీర్కూర్‌లో గత కొద్ది రోజులుగా కలుషితమైన నీరు నల్లాల ద్వారా సరఫరా అవుతోంది. తాగునీటిని క్లోరినేషన్ చేయకుండా అలాగే సరఫరా చేయడంతో రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. - అక్షరటుడే, బాన్సువాడ

# కలుషితం జలం..
# వ్యాధుల భయం..



▸ బీర్కూరులో కలుషిత నీటి సరఫరా ▸ ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రజలు




బీర్కూర్ మండల కేంద్రంలో కొన్ని రోజులు కలుషితనీరు సరఫరా అవుతోంది. పోచమ్మ కాలనీ, గాంధీ చౌక్, మసీదు గల్లి తదితర కాలనీలకు కుళాయిల ద్వారా కలుషిత నీరు వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలలో రెండు సార్లు ట్యాంకులు, సంపులు శుభ్రం చేయాల్సి ఉండగా.. నెలల తరబడిగా తాగునీటి ట్యాంకును శుభ్రం చేయడం లేదని ఆరోపిస్తున్నారు. ట్యాంకు శిథిలావస్థకు చేరడంతో శుభ్రం చేయడానికి పంచాయతీ సిబ్బంది భయపడుతున్నారని చెబుతున్నారు.

**కలుషిత నీటితో రోగాలు..**

ఈ నీటిని తాగడం వల్ల అనారోగ్యానికి గురవుతున్నామని, జ్వరం, ఒళ్లు నొప్పులు, తలనొప్పి వంటి సమస్యలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విష జ్వరాలతో పాటు అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాగునీటి ట్యాంకును శుభ్రం చేయకపోవడం వల్లే ఈ కలుషిత నీరు వస్తోందని, ఈ సమస్యకు తక్షణమే పరిష్కారం చూపాలని కోరుతున్నారు. గత కొన్ని రోజులుగా ఇదే పరిస్థితి నెలకొందని వాపోతున్నారు.

అధికారుల పర్యవేక్షణ నామమాత్రంగా మారిందని, నీటి నాణ్యత పరీక్షలను సైతం అటకెక్కించారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని ప్రజలు కోరుతున్నారు.

### కొన్ని రోజులుగా ఇదే పరిస్థితి




కొన్ని రోజులుగా కుళాయిల ద్వారా కలుషిత నీరు సరఫరా అవుతోంది. ఈ నీటిని తాగి పలువురు ఆస్పత్రి పాలవుతున్నారు. పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు.

– బస్వరాజ్, బీర్కూర్

## స.హ. చట్టం వజ్రాయుధంలాంటిది

**అక్షర టుడే, ఆర్మూర్:** సమాచార హక్కు చట్టం సామాన్యుల చేతిలో వజ్రాయుధంలాంటిది అని స.హ. చట్టం జిల్లా కన్వీనర్, న్యాయవాది ఆనంద్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల వసతి గృహంలో ఆదివారం సమాచార హక్కు చట్టంపై విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే ప్రశ్నించే తత్వం అలవర్చుకోవాలని సూచించారు. గ్రామ పంచాయతీ మొదలు పార్లమెంట్ వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అవసరమైన సమాచారం ఈ చట్టం ద్వారా తెలుసుకోవచ్చన్నారు. అవినీతి అంతం స.హ. చట్టంతోనే సాధ్యమన్నారు. . జీవించే హక్కు భంగం కలిగిన సందర్భాల్లో 48 గంటల్లో సమాచారం ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో వార్డెన్ షబానా బేగం, విద్యార్థినులు పాల్గొన్నారు.






## కల్లు దుకాణాల మూసివేత

**అక్షరటుడే నిజాంసాగర్:** మండల కేంద్రంలోని సుల్తాన్ నగర్ గ్రామ శివారులో గల కల్లు దుకాణాలను ఆబ్కారీ శాఖ అధికారులు మూసివేయించారు. నిజాంసాగర్ ప్రాజెక్టుకు వెళ్లే పర్యాటకులు ఇదే మార్గంగుండా ప్రయాణిస్తూ ఉంటారు. వారికి కల్లు దుకాణాల కారణంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయనే ఉద్దేశంతో ఆ దారిలో ఉన్న 10 దుకాణాలను అధికారులు మూసివేయించారు. దుకాణాలు మూసివేయడంతో తమ ఉపాధి దెబ్బతింటోందని దుకాణాదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## మోదీ చొరవతో యోగాకు అంతర్జాతీయ గుర్తింపు

**అక్షరటుడే, ఇందూరు:** మోదీ ప్రధాని అయిన తర్వాత యోగాకు అంతర్జాతీయ గుర్తింపు తెచ్చారని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. నగరంలోని వినాయక నగర్ శ్రీనగర్ కాలనీలో ఆదివారం ఆరోగ్య యోగా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆధునిక జీవనశైలిలో మానవుడు శారీరకంగా, మానసికంగా ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. యోగా సాధన ద్వారా ఆరోగ్యవంతమైన జీవనాన్ని పొందే అవకాశం ఉందని తెలిపారు. ఆరోగ్య కేంద్రాల స్థాపన ద్వారా ప్రజారోగ్యం అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రతి ఒక్కరూ రోజువారి దినచర్యలో యోగాను అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పంచ రెడ్డి



లావణ్య లింగం, యోగా గురువులు రంజిత్, బీజేపీ నాయకులు లక్ష్మీనారాయణ, మఠం పవన్, హరీష్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



## కేంద్ర ప్రభుత్వ పథకాలను గడపగడపకు తీసుకెళ్లాలి

**అక్షరటుడే, బాన్సువాడ:** కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను గడపగడపకు తీసుకెళ్లాలని బీజేపీ మండలాధ్యక్షుడు నాగేళ్ల సాయికిరణ్ అన్నారు. బీర్కూరు మండలంలోని తిమ్మాపూర్, బీర్కూర్ తండా గ్రామాల్లో ఆదివారం పోలింగ్ బూత్ సంపర్క్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 176, 184, 185 పోలింగ్ బూత్‌లలో కమిటీ సభ్యులతో కలిసి ఇంటింటికీ తిరిగారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. కార్యక్రమంలో బూత్ అధ్యక్షులు పండరి, బాలాజీ, తారాచంద్, బీజేపీ మండల ఉపాధ్యక్షులు హన్మాండ్లు, బస్వరాజ్, మనోజ్, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.



## బధిరుల పాఠశాలలో స్వచ్ఛభారత్

**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలోని బధిరుల ఆశ్రమ పాఠశాలలో ఆదివారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఆర్మూర్ మహాత్మ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో చెత్త, చెదారం, పిచ్చిమొక్కలను తొలగించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్ మాట్లాడుతూ.. తాము నిర్వహిస్తున్న పలు సేవా కార్యక్రమాల స్ఫూర్తితో భవిష్యత్తులో మరికొందరు ముందుకు వస్తారని ఆశిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శాంతమూర్తి, సిబ్బంది సుధ, మాధవి, హరిత, గణేష్, హాస్టల్ సిబ్బంది ఎస్తేర్, స్వచ్ఛంద సంస్థ సభ్యులు నిశాంత్, వేదరాజ్ కుమార్, గణేష్, మధుసూదన్ పాల్గొన్నారు.


## నీటితొట్టిపై నిర్లక్ష్యమేలా..



**అక్షరటుడే, నిజాంసాగర్:** మండలంలోని నర్సింగరావుపల్లి గ్రామంలో ప్రధాన కూడలి వద్ద నిర్మించిన నీటితొట్టి నిరుపయోగంగా మారింది. పంచాయతీ నిధులతో నీటితొట్టీలను నిర్మించి వృథాగా వదిలేయడమేమిటని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా తొట్టీలో చెత్తాచెదారం వేస్తున్నారని.. వెంటనే వాటిని వాడుకలోకి తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## వివాహ వేడుకకు మాజీ ఎమ్మెల్యే హాజరు

**అక్షరటుడే, నిజాంసాగర్:** ఉమ్మడి నిజామాబాద్ జిల్లా మాజీ జడ్పీ ఛైర్మన్ దఫేదార్ రాజు సోదరుడైన ఉపాధ్యాయుడు వెంకన్న కుమారుడితో రాష్ట్ర పీఆర్టీయూ కార్యవర్గ సభ్యుడు రమణ కుమార్తెకు ఆదివారం వివాహం జరిగింది. ఎల్లారెడ్డి మండల కేంద్రంలోని ఫంక్షన్‌హాల్‌లో జరిగిన ఈ వేడుకకు మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఆయనతో పాటు నిజాంసాగర్ మండల సీనియర్ నాయకులు దుర్గారెడ్డి, పార్టీ కార్యకర్తలు హాజరయ్యారు.





## చెరువును కప్పేసిన గుర్రపుడెక్క

పోతంగల్ మండల కేంద్రంలోని పాత పోతంగల్ గ్రామ చెరువును గుర్రపు డెక్క పూర్తిగా కప్పేసింది. చెరువులో నీళ్లు కనిపించకుండా దట్టంగా పెరిగింది. దీంతో చెరువులోని నీళ్ల నుంచి దుర్గంధం వస్తోందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. దోమలబెడద విపరీతంగా పెరిగిందని.. వెంటనే చెరువులో నుంచి గుర్రపుడెక్కను తొలగించాలని కోరుతున్నారు.

– అక్షరటుడే, కోటగిరి